కథ

# అనగనగా ఒకరోజు

—ముచ్చర్ల రజనీ శకుంతల.

వేకువ ఝాము...సమయం అయిదు గంటలు కూడా కాలేదు. కోడి గొంతెత్తి కూయక ముందే వసుధ నిద్ర లేచింది. జుత్తు ముడేసుకుని, చీర కుచ్చిళ్లను పైకి దోపి, మూలనున్న చీపురు అందుకుంది. ఆమె చేయి కంప్యూటర్ కన్నా వేగంగా కదులుతోంది. ఇల్లు వూడ్చి, దాన్ని శుభ్రం చేసి, కిచెన్ రూమ్‌లోకి ప్రవేశించి గ్యాస్ వెలిగించి నీళ్ళు పెట్టింది.

ఆమె కాళ్ళూ, చేతులూ క్షణం విరామం లేకుండా కదులుతూనే వున్నాయి. బ్రష్ నోట్లో పెట్టుకుని, మరో వైపు ఆ రోజు బ్రేక్‌ఫాస్ట్‌లోకి కావలసిన టిఫిన్‌కు సంబంధించిన సరంజామా ఒక్కొక్కటీ బయటకు తీసి కిచెన్ ప్లాట్‌ఫామ్ మీద పెట్టింది.

క్షణాల్లో టాయ్‌లెట్ పని ముగించి, బ్రష్ చేసుకొని, వేడి నీళ్ళను బాత్రూంలోకి షిఫ్ట్ చేసి, గ్యాస్ ఆఫ్ చేసింది.

సమయం అయిదూ ఇరవై అయిదు:

చీరను వంటికి చుట్టుకొని, కుంకుమ బొట్టు నుదుట పెట్టుకుని, మళ్ళీ కిచెన్‌లోకి ప్రవేశించింది. గ్యాస్ మీద బాణలి పెట్టి, ఉప్మా తయారు చేయడం మొదలుపెట్టింది.

పావు గంటలో వేడి వేడి జీడిపప్పు ఉప్మా రెడీ. దాన్ని హాట్ బాక్స్‌లో పెట్టి, కూరగాయలు తరుగుతూ కూచుంది.

మరోపక్క కుక్కర్‌ని రెడీ చేయసాగింది.

గడియారంలోని సెకన్ ముల్లు కన్నా వేగంగా ఆమె చేతి వేళ్ళు కదులుతున్నాయి. బియ్యం, నీళ్ళు, ఉల్లిపాయలు తరగడం, కూరగాయలు కోసుకోవటం...చక చకా చేస్తూనే వుంది మిషన్ కన్నా వేగంగా, ఓ యంత్రంలా... అయినా ఆమె మెదడు మాత్రం ఓ మంచి కథ రాయడం కోసం ఆలోచిస్తూనే వుంది. ఆమె రచయిత్రి కదా మరి! శరీరం తన పని తాను చేసుకుపోతున్నా మెదడు మాత్రం నిరంతరం 'కథ' కోసం ఆలోచిస్తూనే వుంటుంది. అది రచయిత్రుల కుండే అదనవు పని.

ఉదయం ఏడు గంటలు:

పిల్లలిద్దర్నీ లేపి, బలవంతంగా వాళ్ళ కళ్ళు తెరిపించి, బ్రష్ మీద పేస్ట్ పెట్టి, ఇద్దిరకీ అందించింది. వాళ్ళు అలాగే బద్ధకంగా వుండిపోతే, తనే దగ్గరుండి వాళ్ళ పళ్ళు తోమింది. ఈలోగా గ్యాస్ మీద వున్న వేణ్ణీళ్ళు దించి, బాత్‌రూమ్‌లో వున్న బకెట్ లోకి తోడి చన్నీళ్ళు కలిపి స్నానం చేయించసాగింది.

అరగంటలో వాళ్ళు తయారయ్యారు.

*** *** ***

ఉదయం ఎనిమిది గంటలు:

ఉలిక్కిపడి బెడ్‌రూమ్‌లోకి పరుగెత్తింది. భర్త దగ్గరికి వెళ్ళి మెల్లిగా తట్టి లేపింది. మొదటిసారి చిరాకు పడ్డాడు. రెండోసారి కోప్పడ్డాడు. మూడవసారి గొణుక్కుంటూ ఒళ్ళు విరుచుకుని లేచి "కాఫీ" అన్నాడు.

అప్పుడు గుర్తుకొచ్చింది తను చేసిన చిన్న పొరపాటు. రోజూ ఆయన్ని లేపడానికి ముందే కాఫీ చేసే తను... కాఫీ కలిపాక అతడ్ని లేపే తను... ఆ రోజు మరచిపోయింది.

"ఒక్క క్షణం...మరచిపోయానండీ" అంటూ కిచెన్ రూమ్‌లోకి పరుగెత్తింది.

"దరిద్రపు మేళం..మతి మరుపు దెయ్యం" లాంటి పదాలు ఉపయోగించి, చికాగ్గా మళ్ళీ ముసుగు తన్నాడు. ఈసారి కాస్త భయంగానే పిలిచింది కాఫీకప్పుతో వచ్చి. ఆమె చేయి వణుకుతూనే వుంది.

కోపంగా లేచి, ఓ చూపు ఏహ్యాభావంతో చూసి, కాఫీ అందుకుని త్రాగి, షేవింగ్ చేసుకోవడానికి వెళ్ళిపోయాడు.

అతడలా షేవింగ్ పని మొదలెట్టడంతోనే, ఉరుకులు, పరుగులతో కిచెన్‌లోకి వెళ్ళి, వేడినీళ్ళు కాచడం మొదలెట్టింది.

అతడు బయటకు రాగానే, బాత్‌రూమ్‌లో నీళ్ళు స్నానానికి సిద్ధం టవల్, సోప్‌తో సహా.

భర్త స్నానం చేస్తుండగానే, ఇక్కడ పిల్లల పుస్తకాలు నీట్‌గా సర్ది, బ్యాగులు రెడీ చేసి, టిఫిన్ బాక్సులు సర్దింది.

*** *** ***

ఉదయం ఎనిమిదిన్నర:

భర్త డైనింగ్ రూమ్‌లోకి రాగానే టిఫిన్ ప్లేట్లో పెట్టి చెట్నీ ఓ గిన్నెలో సర్ది అతని ముందుంచింది.

"ఇవ్వాళ కూడా ఉప్మానేనా?" కోపంగా అడిగాడు. ఉప్మాను చెట్నీ కాంబినేషన్‌తో కలిపి లాగిస్తూ.

"మినపప్పు, ఇడ్లీ రవ్వ లేదు. నిన్ననే చెప్పాను" భయంగానే చెప్పింది వసుంధర.

అతను సీరియస్‌గా చూసి "తెచ్చుకుని తగలడొచ్చుగా" అన్నాడు కోపంగా.

"డబ్బులు?" నసిగింది వసుధ.

'అన్నింటికీ నేనే ఇవ్వాలి కాబోలు..ఛ..ఛ! నా సంపాదనంతా మిమ్మల్ని ఉద్ధరించడానికే సరిపోతుంది" కోపంగా అన్నాడే కానీ జేబులో నుంచి డబ్బులు తీసి ఇవ్వలేదు.

'నా జీతమ్మొత్తం రాగానే పాకెట్ మనీ కూడా తీసుకోకుండా మీకే ఇచ్చాను' అని ఆమెకు అనాలని వున్నా అన్లేదు. అంటే 'పెద్ద నువ్వే సంపాదిస్తున్నావని గర్వమా?' అని అనగలడు. 'ఒళ్ళు ఎలా వుంది?' అని నిలదీయగలడు. 'నువ్వు తెచ్చే బోడి డబ్బు నా పాకెట్ డబ్బుకు కూడా సరిపోదు!'అని డబాయించగలడు అతనికన్నా ఓ అయిదు వందలు ఎక్కువ సంపాదిస్తున్న తనని...ఆ విషయం తెలిసీ మౌనంగా వుండిపోయింది.

అతను టిఫిన్ చేసి ట్రిమ్‌గా తయారయ్యాడు. పెర్ఫ్యూమ్ స్ప్రే చేసుకున్నాడు. పౌడర్ లేదని అంటే, 'మొహానికి రంగేసుకుని ఊరేగకపోతే ఎవడూ చూడడా? ఏంటీ? సానిదానిలా తయారవ్వడం?' అంటాడు. ఇంపోర్టెడ్ పెర్ఫ్యూమ్ వందలు తగలేసి తెచ్చుకుంటాడు. నవ్వుకుంది వసుధ తన దురదృష్టాన్ని తిట్టుకుని, తన తలరాతను తలచుకుని!

*** *** ***

ఉదయం తొమ్మిదిగంటలు:


"ఏంచేస్తున్నావు లోపల? నాకు ఆఫీసుకు టైమవుతోందని తెలియదా? ఛీ...ఛీ...పంక్చుయాలిటీ అంటేనే తెలియకుండా పోతోంది" అంటూ అతగాడు విసుక్కోవటం పూర్తి కాకుండానే ఆఘమేఘాల మీద టిఫిన్ బాక్స్ తీసుకొచ్చి, స్కూటర్ డిక్కీలో పెట్టి తన చీర కొంగుతో సీటు తుడిచింది. రెండు కిలోమీటర్ల దూరంలో వున్న అతనాఫీసుకు గంట ముందు వెళ్తాడు.

రెండు స్టాపులు మారి బస్సులో వెళ్ళాల్సిన తన గురించి ఆలోచించని అతగాడిని సాధించలేదు వసుధ. ఎందుకంటే సీత పుట్టిన దేశం కనుక.

*** *** ***

ఉదయం తొమ్మిది గంటల పది నిమిషాలు:

పిల్లలిద్దర్నీ స్కూల్ ఆటోలో పంపించింది.




వాళ్ళకు టాటా చెప్పి హడావిడిగా లోపలికి వచ్చి గబగబా స్పూన్‌తో రెండు ముద్దలు ఉప్మా తినేసింది. అప్పటికే చల్లారి రుచి తగ్గింది.

చెప్పులు వేసుకొని బ్యాగు తీసి చూసింది. రెండు రూపాయిల నాణేలు నాలుగున్నాయి. ఎనిమిది రూపాయిలు. సరిగ్గా రేపటి వరకూ వస్తాయి. ఎల్లుండి ఆదివారం. ఆ తర్వాత ఫస్ట్. జీతాలు వచ్చేరోజు. ఆ రోజుకి ఆఫీసుకు వెళ్ళాలంటే బస్సు మారి, మరో స్టాపు వరకూ నడవాలి, లేదా సాయంత్రం వూట 'సరదా వాకింగ్' అనే పేరుతో నడవాలి.

ఏది చేయాలీ అనేది టాస్ వేయకుండా, ముందు ఆఫీసుకు వెళ్ళాలనే విషయాన్ని మరచిపోకుంకా, గుర్తుంచుకుని బస్టాప్‌కేసి పరుగెత్తింది వసుధ.

*** *** ***

ఆఫీసులకు వెళ్ళే టైమ్ కాబట్టి రష్‌గా వుంది బస్టాప్. బస్సుల్లో ముందూ, వెనకా తేడా లేకుండా జనం రెండు వైపుల నుంచీ ఎక్కేస్తున్నారు. ఆడా, మగా, లేడీస్ ఫస్ట్ లాంటి నిబంధనలు గాలికొది లేసి, యుద్ధం మొదలుపెట్టారు. ఇదే అదనమకొని

కొందరు మగ మహానుభావులు అమ్మాయిల వీపుల' మీద చేయి వేయడం లాంటి వెకిలి పనులూ చేస్తూనే వున్నారు. ఒకరినొకరు తోసుకుంటున్నారు. ఎవర్నీ అనకూడని పరిస్థితి. ఇదీ హైటెక్ సిటీ.

*** *** ***

*ఉదయం పది గంటలు:*

రెండు బస్సులు మారి, స్టాప్‌లో దిగి ఆఫీసుకు పరుగెత్తుకొచ్చేసరికి, రిజిస్టర్ అప్పుడే 'బాస్' క్యాబిన్‌లోకి వెళ్ళింది. ఏడుపు ఒక్కటే తక్కువైంది.

ఎంత ప్రయత్నించినా, సంతకం పెట్టేందుకు తను చేరుకోలేకపోతోంది. ప్చ్..ఇవ్వాళా చీవాట్లు తప్పవు! భయపడుతూనే బాస్ ఛాంబర్ లోకి వెళ్ళింది.

"ఏంటి? ఇవాళా లేటేనా? అసలు నాకు బుద్ధి లేదమ్మా! ఇవాళ కరెక్ట్ టైమ్‌కు వచ్చావా? అని హాశ్చర్యంగా అడగాలి గానీ...నీకు ఏన్నోసార్లు వార్నింగ్ ఇచ్చాను ఆలస్యంగా రావొద్దని...ఇదే ఫస్ట్ అండ్ లాస్ట్. కాదు.. కాదు..లాస్ట్ అండ్ లాస్ట్ వార్నింగ్..." కోపంగా అని రిజిస్టర్ ఆమె ముందుకు విసురుగా తోశాడు.

ఏడుపు దిగమింగుకుని సంతకం చేసి 'సారీ' అతని మొహానకొట్టి మనసులో అనుకుంది 'నువ్వూ ఆడదానివైతే, నా మొగుడు లాంటి మొగుడు దొరికితే ఈ బాధ అర్థమయ్యేది".

"ఏంటి... వసుధా...బ్రేక్‌ఫాస్ట్ వడ్డించాడా? అయినా నాతో ఒక మాట ముందు చెబితే నేనే ఓ అయిదు నిమిషాలు రిజిస్టర్ ఆపించేవాడినిగా..." అంటూ ఆమెకు దగ్గరగా వచ్చి "రెండు ఫైళ్ళు పెండింగ్‌లో వున్నాయి. ఏం చేస్తావు? నువ్వు సరేనంటే ఆ ఫైల్స్ ఆ పంకజానికి పంపిస్తా.." అంటూ ఓ వెకిలి నవ్వు నవ్వాడు.

రోజూ వసుధకిది అలవాటే.

సెక్షన్ ఇన్‌ఛార్జి అతను.

బాస్ దగ్గర ఇన్‌ఫ్లుయన్స్ వుంది. ఇక్కడ ఆమె 'సరే'నడం ఆఫీసుకు సంబంధించిన విషయంలో కాదు. ఆమె అతనితో పాటు హోటల్ కెళ్ళి కాఫీ తాగాలి. అది మొదటి దశ. అది పూర్తయ్యాక 'లంచ్' అంటాడు. ఇంకా ఆ తర్వాత 'డిన్నర్' అంటాడు. ఇంకా ఆ తర్వాత మా ఫ్రెండ్ రూమ్ ఖాళీగా వుంది.. 'ఆఫ్‌డే' పర్మిషన్ తీసుకొని వచ్చేయ్" బాస్ దగ్గర నేను మేనేజ్ చేస్తానంటాడు. ఇవన్నీ ఆమెకు తెలుసు.. అందుకే 'కాఫీ' దగ్గరే రిజెక్ట్ చేసింది. అందుకే అతను అడపాదడపా వర్క్ ఎక్కువిచ్చి, అవసరమైతే రాత్రి ఆలస్యమయ్యేవరకూ వుంచి, ఒకోసారి పది కొట్టకముందే అటెండెన్స్ రిజిస్టర్ పంపించి, 'మెమో'లు ఇప్పించి, తన కోపాన్ని వెళ్ళగక్కుతాడు. అయినా భరాయించాలి. తప్పదు.

ఎక్కడా లేదీ ఎక్స్‌ప్లాయిటేషన్. ఛ..ఛ...తనని తను తిట్టుకుంది.

భర్తతో చెబితే అర్థం చేసుకోవడం మాని, అనుమానించడం మదలుపెడతాడు.'కొంపదీసి ఏదో ఒక రోజు కమిటయ్యేలా వున్నావు' అని అన్నా ఆశ్చర్యం లేదు.

అంతేగానీ 'వెధవ ఉద్యోగం పోతే పోయింది. వాడ్ని చెప్పుతో కొట్టి బుద్ధొచ్చేలా సమాధానం చెప్పి వచ్చేయ్' అని మాత్రం అనడు. ఆ విషయం తను పెళ్ళయిన ఆరేళ్ళుగా తెలుసు.

*** *** ***

*సాయంత్రం అయిదున్నర:* బస్‌స్టాప్‌కు వచ్చి, మళ్ళీ రెండు బస్సులు మారి ఇంటికొచ్చి, ఇంటిని వూడ్చి దీపాలు వెలిగించి, స్కూల్ నుంచి వచ్చిన పిల్లల బట్టలు మార్చి, వాళ్ళకు టిఫిన్ చేసి పెట్టి, తాను మొహం కడుక్కోవడం పూర్తయ్యేసరికి, ఆపసోపాలు పడుతూ స్కూటర్ మీద ఇంటికొచ్చిన భర్తకు ఎదురెళ్ళి అతని చేతిలోని బ్యాగు అందుకుని, అతనికి టిఫిన్ వేడివేడిగా రెడీ చేసి, కాఫీ ఇచ్చి... మళ్ళీ వంట ప్రయత్నంలో పడిపోతూ...మధ్య మధ్య..పిల్లలతో హోం వర్క్ చేయిస్తూ...

*రాత్రి ఎనిమిది గంటలు:*

పిల్లల నోట్సులు చెక్ చేసి, పెన్సిల్స్ చెక్కిచ్చి, పుస్తకాలు నీట్‌గా సర్ది, అన్నం తినిపించి నిద్రబుచ్చింది వసుధ. ఈలోగా సోఫాలో కాలుమీద కాలు వేసుకుని టి.వి. చూస్తున్న భర్త దగ్గర్నుంచి పిలుపు...అన్నం వడ్డించమని.

అతనికి వేడివేడిగా అన్నం వడ్డించి, అతను తినడం పూర్తయ్యే వరకూ వుండి ప్లేటు తీసి, ఇంట్లో వంట పాత్రలు కడిగి, వంటిల్లు శుభ్రం చేసేసరికి తొమ్మిది దాటుతోంది.

*** *** ***

మిగిలిన కాసంత అన్నం చారుతో చాలించి, ప్లేటును కడిగి, మిల్క్ కుక్కర్ మీద పాలు వేడి చేసి, వేడి వేడిగా భర్తకు తెచ్చిచ్చింది.

మర్నాటికి సంబంధించిన పిల్లల స్కూల్ డ్రెస్‌లు ఇస్త్రీ చేసి, భర్త బట్టలు ఓ పక్కకు పెట్టి, లుంగీ తీసి అతనికి అందించి, తన బట్టలు ఐరన్ చేసి సర్దేసరికి పది దాటింది.

*** *** ***

*రాత్రి పదిన్నర గంటలు:*

అలసట...నీరసం...బాధ...ఆవేదన...ఉదయం నుంచి మానసికంగా, శారీరకంగా అలసిపోయి అటుతిరిగి పడుకుంది.

*** *** ***

అప్పుడే నిద్రపడుతుండగా శరీరమ్మీద ఓ చేయి... ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది.

"నేనే..హి...హి...హి.." అంటూ ఓ చిర్నవ్వు నవ్వి ఆమె శరీరమ్మీద తన చేతిని కదిలిస్తూ...ఆమెను ఆక్రమించుకునే ప్రయత్నంలో అతడు.

ఆమె శరీరం అలసిపోయింది. మనసు నీరసంతో నిండిపోయింది. అణువణువూ పచ్చిపుండులా మారిపోయింది. కానీ ఆమె ఫీలింగ్స్‌తోనూ, ఆమె మనసుతోనూ, ఆమె ఆరోగ్యంతోనూ సంబంధం లేకుండా...తనకు పట్టనట్టుగా...ఆబగా, ఆత్రంగా, ఆవేశంగా, ఉద్రేకంగా ఆమెను ఆక్రమించుకుంటూ...

*** *** ***

*రాత్రి పదకొండున్నర:*

అతను తన పని పూర్తవ్వగానే అటు తిరిగి పడుకున్నాడు.

ఆమె కళ్ళు బాధతో వర్షిస్తున్నాయి. సెక్స్ అంటే స్త్రీ, పురుషుల కోరికలకు ఒక వేదిక అని మరచి, తన ఆకలికి స్త్రీ ఓ యంత్రంలా...ఓ సెక్స్ వర్కర్లా అని భావించే భర్తను చూసి కన్నీళ్ళు జలజలా రాలాయి.

నిజానికి భార్య ఇష్టంతో నిమిత్తం లేకుండా ఆమెని అనుభవిస్తే భర్త అయినా సరే అతను శిక్షార్హుడు.

అది ఆమెకు తెలుసు. అయినా భరాయిస్తుంది. ఎందుకంటే సమాజంలో నగటు స్త్రీ కనుక.

ఈ సమాజంలోని మగాళ్ళందరూ ఎలాంటి వాళ్ళయినా తన భర్త అనే మగాడు, తనని అంటిపెట్టుకుని, తానే జీవితం కాకపోయినా, అతని జీవితంలో తనూ ఓ భాగమని గుర్తిస్తాడనుకున్న ఆమె....

కనీసం తనో మనిషినని అయినా గుర్తించనందుకు ఏడుస్తోంది.

తెల్లవారితే మళ్ళీ మామూలే...టైమ్ అర్ధరాత్రి పన్నెండు గంటలు సూచిస్తోంది గోడ గడియారం.

*** *** ***

ఇది అనగనగా ఒక రోజు!

ఆమె వసుధయినా కావచ్చు.

వినీత కావచ్చు.

నీలిమ కావచ్చు.

సమత కావచ్చు.

మరో సుశీల కావచ్చు.

పేరు ఏదైనా, పదవి ఏదైనా, ఆమె తరతరాల పురుషాహంకార వ్యవస్థకో, వాళ్ళ దుష్ట ఆలోచనలకో బలవుతూ అవస్థలు పడుతూనే వుంది...వుంటుంది!

ఓ వర్కింగ్ ఉమెన్ జీవితమనే డైరీలో ఓ రోజు పేజీ 'ఈ అనగనగా ఒక రోజు.'

అది ఏరోజైనా, ఆమె డైరీలోని పేజీలో ఈ విషాదపు పేజీనే.

కాదని మీరనుకోగలరా? అలా మీ జీవితంలోని ఓరోజు కాకూడదనే నా కోరిక.

ఆరోజు ఎప్పుడొస్తుందో?

ఇందుకు భిన్నంగా మీ డైరీలోని 'అనగనగా ఒక రోజు' వుంటే అందుకోండి అభినందనలు.